క్లుప్తంగా

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం


దాతకు విరాళం బాండ్ అందిస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుడు బుధవారం రూ.1,51,674 విరాళంగా అందజేశారు. భీమడోలుకు చెందిన సలాది వీరవెంకట సత్యనారాయణ ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమ చేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ ఏఈఓ పి.నటరాజారావు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

ఘంటసాల చిరస్మరణీయుడు


ఘంటసాల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: ప్రపంచ గాయకుల్లో ఘంటసాల చిరస్మరణీయుడని కవులు రెడ్డి, తిప్పాబొట్ల రామకృష్ణ అన్నారు. బుధవారం జంగారెడ్డిగూడెంలో ఘంటసాల వెంకటేశ్వరరావు 102వ జయంతిని సందర్భంగా ఆయన విగ్రహానికి సినీ దర్శకుడు కాసర నర్సిరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ పదంలోనే భావాన్ని స్పష్టంగా శ్రోతలకు చేరేలా పాడటం ఘంటసాల విశిష్టతన్నారు. కార్యక్రమంలో విగ్రహ వ్యవస్థాపకులు సుబ్బాచారి, చిట్రోజు తాతాజీ, మల్లవరపు సత్యనారాయణ, జగదీష్, నీరజ, చింతామణి పాల్గొన్నారు.

విద్యార్థినిని పరామర్శించిన పీడీఎస్‌యూ నాయకులు


విద్యార్థిని నుంచి వివరాలు సేకరిస్తున్న పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు

బుట్టాయగూడెం: మండలంలోని ఇప్పలపాడు సమీపంలో ఉన్న గురుకుల ఏకలవ్య పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయురాలు అనారోగ్యంతో ఉన్న విద్యార్థినితో వ్యాయామం చేయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు బన్నే వినోద్ అన్నారు. బుధవారం స్థానిక సిహెచ్‌సీలో చికిత్స పొందుతున్న విద్యార్థిని హేమలతను పరామర్శించారు. అనంతరం విద్యార్థినిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థినిని వ్యాయామం చేయించడం వల్లే సొమ్మసిల్లి పడిపోయిందన్నారు. పాఠశాలలో బాలికలు, బాలుర వసతి గృహాలకు వార్డెన్లు లేకపోవడం వల్ల విద్యార్థులను పట్టించుకునే నాథుడే కరువయ్యారన్నారు. ఐటీడీఏ అధికారులు ఏకలవ్య పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

డెంగీ, మలేరియాపై అవగాహన

ఏలూరు టౌన్: డెంగీ, మలేరియా, ఇతర విషజ్వరాల పట్ల ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని ఏలూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శర్మిష్ఠ సూచించారు. ఏలూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో బుధవారం డెంగీ, మలేరియా కరపత్రాలను ఆవిష్కరిస్తూ ప్రజలకు కరపత్రాల ద్వారా ఇతర సామాజిక మాధ్యమాల ద్వారా దోమల ద్వారా వచ్చే వ్యాధులపై, దోమల నిర్మూలన పద్ధతులు పై, భవిష్యత్తులో దోమల ద్వారా వచ్చే వ్యాధులైన డెంగీ, మలేరియా, చికెన్ గున్యా, వ్యాధులపై విస్తృత అవగాహన కల్పించాలన్నారు. దోమ లార్వాలను నిర్మూలించాలంటే ఫ్రైడే డ్రైడే, ఇంటి లోపల ఇంటి బయట వారానికి పైబడి మంచి నీళ్లు నిల్వ ఉంచరాదని, నేల తొట్లపై మూతలు పెట్టుకోవాలని కరపత్రాల ద్వారా అందరికీ అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి పీఎస్ఎస్ ప్రసాద్, ఐడీఎస్‌పీ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ చక్రధర్ రావు , వైద్యాధికారి డాక్టర్ శశాంక్, డెమో నాగరత్నం, అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

మరియ థెరిస్సాకు సన్మానం

దెందులూరు: ఆధ్యాత్మిక అభివృద్ధి, సేవ తత్పరత, సంఘ సేవతో కృషి చేస్తున్న ప్రావెన్షియల్ మరియ థెరిసా అభినందనీయురాలని దెందులూరు ఆర్‌సీఎం చర్చి ఫాదర్ జి.అమ్మన్ రాజా అన్నారు. బుధవారం దెందులూరు సెయింట్ మేరీ యూపీ పాఠశాలలో ఫ్రాన్సిస్ ఎఫ్‌సీసీ సభలో ప్రావెన్షనల్‌గా నియమితులైన మరియ థెరిసాను దెందులూరులో ఘనంగా సత్కరించారు. సన్మాన గ్రహీత ప్రావెన్షనల్ మరియా థెరిస్సా మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి తన పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని, ఉపాధ్యాయులు నాణ్యత ప్రమాణాలతో కూడిన విద్యాబోధన చేయాలని సూచించారు. హెచ్‌ఎం సిస్టర్ టీనా, ఉపాధ్యాయులు ఉన్నారు.

వైద్యులు కావలెను

- ఏరియా ఆసుపత్రుల్లో వైద్యుల కొరత
- వైద్యం అందక రోగుల పాట్లు


జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రిలో వైద్యుల కోసం ఎదురు చూస్తున్న గర్భిణులు


చింతలపూడి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి

చింతలపూడి: నియోజకవర్గంలోని ప్రభుత్వ ఆసుపత్రులను వైద్యుల కొరత వేధిస్తుంది. దీంతో ఎంతో ఆశగా ఆసుపత్రులకు వచ్చే పేద రోగులకు సరైన వైద్యసేవలు అందడం లేదు. చింతలపూడి, జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రుల్లో గత కొంతకాలంగా ఇదే పరిస్థితి కొనసాగుతుంది. ముఖ్యమైన విభాగాలకు వైద్యులు లేకపోవడంతో వచ్చిన రోగులను ఏలూరు జిల్లా ఆసుపత్రికి రిఫర్ చేస్తున్న సంఘటనలు ఇక్కడ నిత్యకృత్యమయ్యాయి. నియోజకవర్గ కేంద్రంలో ఉన్న ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రికి లింగపాలెం, కామవరపుకోట, టి.నర్సాపురం, చింతలపూడి మండలాల నుంచే కాక కృష్ణా జిల్లా, ఖమ్మం జిల్లాల నుంచి నిత్యం 300 నుంచి 400 మంది రోగులు ఈ ఆసుపత్రికి వస్తుంటారు. రోడ్డు ప్రమాద బాధితులు, పాము కాటు, కుక్క కాటు బాధితులు ఇక్కడికే వస్తుంటారు. ప్రతి రోజూ వైద్యుల కోసం పడిగాపులు పడాల్సి వస్తోందని రోగులు వాపోతున్నారు. చింతలపూడి ఏరియా ఆసుపత్రిలో 23 మంది వైద్యులు ఉండాలి. కాని కేవలం పది మంది మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. వీరిలో ఇద్దరు డిప్యుటేషన్‌పై వారానికి రెండు రోజులు విధులకు హాజరవుతారు. మహిళల కోసం ఏర్పాటు చేసిన సీమాంక్ సెంటర్ అంతంత మాత్రంగా పని చేస్తుంది. 24 గంటలూ ఆసుపత్రికి వచ్చే ప్రసూతి కేసులను సీమాంక్ సెంటర్‌లోనే చూడాలి. గైనకాలజిస్టు డాక్టర్ డిప్యుటేషన్‌పై పని చేస్తుండటంతో ప్రసవం కోసం వచ్చే గర్భిణులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. గతంలో రూ.20 లక్షలతో ఆసుపత్రిలో ఆధునిక పరికరాలు ఏర్పాటు చేశారు. నిపుణులు లేకపోవడంతో అవి నిరుపయోగంగా మారాయి. వైద్యులను నియమించాలని రోగులు కోరుతున్నారు.

జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రిలో..

జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి ప్రతి రోజూ 300 మంది రోగులు వస్తారు. ఆసుపత్రిలో 24 మంది వైద్యులు ఉండాలి. కాని ప్రస్తుతం 18 మంది వైద్యులు మాత్రమే ఉన్నారు. పిల్లల వైద్యుడు, జనరల్ సర్జన్లు ఇద్దరు, జనరల్ మెడిసిన్, ఎనస్థీషియన్, రేడియాలజీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అలాగే 11 స్టాఫ్ నర్సుల పోస్టులు, నర్సింగ్ సూపరింటెండెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రక్తనిధి కేంద్రంలో మెడికల్ ఆఫీసర్, రెండు ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులు, స్టాఫ్ నర్సు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పిల్లల విభాగంలో మెడికల్ ఆఫీసర్ పోస్టు ఖాళీగా ఉంది.

కామవరపుకోట..

మండలంలో రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. ఒకటి తడికలపూడి, రెండోది కామవరపుకోట అయితే తడికలపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు మహిళా డాక్టర్లు పని చేస్తున్నారు. కామవరపుకోట ఆరోగ్య కేంద్రంలో ఒక మహిళ, ఒక పురుష డాక్టర్లు పని చేస్తుండగా, ఇటీవల మహిళా డాక్టరు దీర్ఘకాలిక సెలవుపై వెళ్లిపోయారు. ఉన్న ఒక డాక్టర్ ఎఫ్‌డీసీ క్యాంపులకు బయట గ్రామాలకు వెళ్లిపోవడంతో, రోగులుకు వైద్యులు అందుబాటులో లేక చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ అస్పత్రికి ప్రతి రోజూ రోగులు వందల సంఖ్యలో వస్తూ ఉంటారు. కానీ డాక్టర్లు అందుబాటులో లేకపోవడంతో ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించి, ఆర్థికంగా నష్టపోతున్నారు.

వైద్యులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి



రాత్రి సమయాల్లో ప్రసూతి వైద్య సేవల నిమిత్తం, పాము కాటుకు, ఇంకా అత్యవసర పరిస్థితుల్లో వైద్యం కోసం వచ్చే వారికి డాక్టర్లు అందుబాటులో ఉండటం లేదు. రాత్రి, పగలు డాక్టర్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి

సిరిగినేటి వెంకన్న బాబు, కొత్తూరు గ్రామం, కామవరపుకోట మండలం

మందుల కొరత లేదు



ఆసుపత్రిలో మందుల కొరత లేదు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేవు, ఆసుపత్రికి వచ్చే రోగులకు అత్యవసర మందులు అవసరమైతే బయటి నుంచి కొనుగోలు చేసి అందిస్తాం.

డాక్టర్ సీహెచ్ బేబీకమల, సూపరింటెండెంట్

భూ ఆక్రమణలపై చర్యలకు వినతి

కామవరపుకోట: భూ కబ్జాదారుల నుంచి రక్షణ కల్పించాలని ఏలూరు చైత్ర హాస్పిటల్ యజమాని డాక్టర్ ఈడుపుగంటి హరి భగవాన్, ఈడుపుగంటి నవరాజు బుధవారం విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను తమ క్యాంప్ కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. కామవరపుకోట నుంచి బొర్రంపాలెం వెళ్లే రోడ్డులో వారికి 15 ఎకరాల భూమి ఉందని, కామవరపుకోటకు చెందిన టీడీపీ నాయకులు మా భూమిని కబ్జా చేసేందుకు గత కొంత కాలం నుంచి ఫలసాయాన్ని దోసుకెళ్తూ, మాపై దౌర్జన్యం చేస్తున్నారని, వారి నుంచి మాకు రక్షణ కల్పించాలని ఆయనను కోరామన్నారు. అందుకు ఆయన స్పందిస్తూ ఈ సంఘటనపై న్యాయం చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు బాధితులు తెలిపారు.

భూ ప్రకంపనలతో మూగజీవాల హడల్


భూ ప్రకంపనల సమయంలో రోడ్డుపై ఒకే చోట చేరి భయంతో అరుస్తున్న శునకాలు

కొయ్యలగూడెం: కొయ్యలగూడెంలో బుధవారం సంభవించిన భూ ప్రకంపనలకు మూగజీవాల సైతం హడలిపోయాయి. భూమి కంపించిన సమయంలో ఒక్కసారి స్థానిక తాడేపల్లిగూడెం రోడ్డులో శునకాలు ఒక్క చోటకు చేరి పెద్దగా అరిచాయి. భూమి కంపించి, ఆగిన మరుక్షణం శునకాలు అరుపులు కూడా నిలిపివేశాయని స్థానిక ప్రజలు తెలిపారు.

6 నుంచి రెవెన్యూ సదస్సులు

దెందులూరు: రెవెన్యూ సదస్సులు ఈనెల 6 నుంచి జనవరి 8వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు దెందులూరు తహసీల్దార్ బి.సుమతి తెలిపారు. బుధవారం దెందులూరు తహసీల్దార్ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ భూ సంబంధిత సమస్యల నమోదు పరిష్కారం లక్ష్యంగా గ్రామాల్లో నిర్వహించే రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. డిప్యూటీ తహసీల్దార్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, వీఆర్వోలు, వీఆర్ఏలు, గ్రామ సర్వేలు సిద్ధం కావాలన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం


ఎన్నికల సామాగ్రి పంపిణీ చేస్తున్న ఆర్డీవో, డీఎస్పీ తదితరులు


పోలీసు బందోబస్తును కేటాయిస్తున్న డీఎస్పీ యు.రవిచంద్ర


పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న అధికారులు

జంగారెడ్డిగూడెం: రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆర్డీవో ఎంవీ రమణ తెలిపారు. బుధవారం ఆర్డీవో కార్యాలయం వద్ద పోలింగ్ సిబ్బందికి ఎన్నికల మెటీరియల్ పంపిణీ కార్యక్రమాన్ని ఆమె పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెవెన్యూ డివిజన్ పరిధిలో పది పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఓటర్ల వివరాలు ఇలా

బుట్టాయగూడెం కేంద్రంలో 339 మంది ఓటర్లు, ద్వారకాతిరుమల మండలంలో 69మంది ఓటర్లు, జీలుగుమిల్లి మండలంలో 70, జంగారెడ్డిగూడెం మండలంలో 273మంది, కామవరపుకోట మండలంలో 55 మంది, కుక్కునూరులో ఆరుగురు, కొయ్యలగూడెం మండలంలో 113 మంది, పోలవరం మండలంలో 103 మంది, టి.నరసాపురం మండలంలో 35 మంది, వేలేరుపాడు మండలంలో 11మంది ఓటర్లు ఉండగా, మొత్తం డివిజన్ పరిధిలో 1074 మంది ఓటర్లు తమ ఓటును వినియోగించుకోనున్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉన్నట్లు తెలిపారు.

పటిష్ట పోలీసు బందోబస్తు: డీఎస్పీ

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి రెవెన్యూ డివిజన్ పరిధిలో 10 పోలింగ్ కేంద్రాల్లో పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు డీఎస్పీ యు.రవిచంద్ర తెలిపారు. ఆర్డీవో కార్యాలయం వద్ద పోలీసు బలగాలకు విధులను కేటాయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ పోలింగ్ బూత్ వద్ద ఐదుగురు పోలీసులు బందోబస్తు నిర్వహిస్తారన్నారు. స్ట్రైకింగ్ పోర్స్ ప్రతీ పోలింగ్ బూత్ వద్ద ఒక ఎస్సై, ముగ్గురు సిబ్బంది విధులు నిర్వహిస్తారన్నారు. సర్కిల్‌కు ఒక సీఐ, ఐదుగురు సిబ్బంది పనిచేస్తారన్నారు. డీఎస్పీలు ఇద్దరు, 10 మంది సిబ్బంది బందోబస్తును పర్యవేక్షిస్తారని చెప్పారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా అన్ని చర్యలు చేపట్టినట్లు డీఎస్పీ తెలిపారు. తహసీల్దార్ కె.స్లీవజోజి, కమిషనర్ కేవీ రమణ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లు పూర్తి

పోలవరం రూరల్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లు చేసినట్లు తహసీల్దార్ ఆర్ఎస్ రాజు తెలిపారు. పోలవరం జూనియర్ కళాశాలలో పోలింగ్ బూత్‌ను ఏర్పాటు చేశామన్నారు. బూత్‌ను బుధవారం తహసీల్దార్‌తో పాటు పోలవరం సీఐ సురేష్‌బాబు, ఎస్సై ఎస్ఎస్ పవన్ కుమార్ పరిశీలించారు. ఈ నెల ఐదో తేదీ ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తామని, 103 మంది ఓటర్లు ఉన్నారన్నారు. సీఐ సురేష్ బాబు మాట్లాడుతూ పోలింగ్ బూత్ పరిసర ప్రాంతాల్లో గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. మండల పరిషత్ ఏవో సీహెచ్ శ్రీనివాస బాబు, రెవెన్యూ సూపరింటెండెంట్ కె.శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ బూత్ పరిశీలన


పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్

కొయ్యలగూడెం: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ బూత్ కేంద్రాలను తహసీల్దార్ కె.చెల్లన్నదొర బుధవారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రంగా ఏర్పాటు చేసిన జూనియర్ కళాశాల వద్దకు వెళ్లి, అధికారులకు సిబ్బందికి సూచనలు చేశారు. మొత్తం 113 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఓటింగ్ ప్రక్రియ నిర్వహిస్తామని తహసీల్దార్ తెలిపారు.

సుబ్రహ్మణ్య షష్ఠి మహోత్సవాలు ప్రారంభం


విశేష అలంకరణలో శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక పోస్టల్ కాలనీలోని శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానంలో స్వామి వారి 24వ శాంతి కళ్యాణ మహోత్సవాలు, షష్ఠి మహోత్సవాలు బుధవారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా ఉదయం గణపతి పూజ, పుణ్యాహవాచనం, రక్షా బంధనం, అఖండ దీపారాధన నిర్వహించారు. అనంతరం దీక్షాధారణ, వాస్తు హోమం, దేవతా ఆవాహన పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి విశేష అలంకరణ చేశారు. అనంతరం నీరాజన మంత్ర పుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేశారు. ఆలయ అర్చకులు రవికుమార్ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించగా కార్యనిర్వహణాధికారి జి.పవన్ కుమార్ కార్యక్రమాలు పర్యవేక్షించారు.

వేరుశనగలో డ్రోన్ స్ప్రేయింగ్ పరిశీలన


డ్రోన్ స్ప్రేయింగ్ పనులను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తల బృందం

బుట్టాయగూడెం: వ్యవసాయ డ్రోన్లు పంట పెరుగుదల దశలో, పంట ఆరోగ్యం, నేల వైవిధ్యాలపై సమాచారాన్ని అందిస్తాయని డాక్టర్ వైఎస్సార్ విశ్వ విద్యాలయం విస్తీర్ణ సంచాలకులు డాక్టర్ బి.గోవిందరాజులు, కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త కె.కరుణశ్రీ అన్నారు. మండలంలోని కాపవరంలో డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తల బృందం బుధవారం మండలంలోని కాపవరంలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామం సమీపంలో ఉన్న వేరుశనగ పంటను పరిశీలించారు. అదే విధంగా వేరుశనగ పంటలో డ్రోన్ల ద్వారా చేస్తున్న పురుగుమందుల పిచికారీ పనులను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ సాగులో ఉన్న టీసీజీఎస్-1674 రకం వేరుశనగ చీడపీడలు తట్టుకుని అధిక దిగుబడి ఇస్తుందన్నారు. పింక్ కలర్ గింజల్లో అధిక నూనె శాతం కలిసి మార్కెట్‌కు అనుకూలంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ పెద్దబాబు, డాక్టర్ విజయలక్ష్మి, హెచ్ఓ నవీన్, మణిమాల, వీహెచ్ఏ వంశీ, ఉపసర్పంచ్ చల్లయ్య, రైతులు మల్లయ్య, వెంకటేష్, రాము, తదితరులు పాల్గొన్నారు.

ప్రధానమంత్రి సూర్యఘర్ యోజనపై కళాజాత


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పీర్ అహ్మద్‌ఖాన్

చింతలపూడి ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన పథకం ద్వారా దేశంలో కోటి ఇళ్ళపై సోలార్ ప్యానెల్లను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పీర్ అహ్మద్ ఖాన్ తెలిపారు. స్థానిక ట్రాన్స్‌కో ఏడి కార్యాలయం వద్ద బుధవారం సోలార్ విద్యుత్ వినియోగం ,సూర్య ఘర్ యోజన పథకం పై కళాజాతా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఈ మాట్లాడుతూ కోటి ఇళ్లపై రూఫ్‌టాప్ సోలార్ ప్యానెళ్లను ఏర్పాటు చేయడం వల్ల దేశం శిలాజ ఇంధన ఆధారిత విద్యుత్‌పై ఆధారపడటాన్ని తగ్గించడంలో సహాయపడుతుందన్నారు. సూర్యరశ్మిని ఉపయోగించుకుని విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఏడీ బీవీ రాంబాబు నాయక్ , మాజీ సర్పంచ్ చిట్లూరి ధర్మరాజు, ఏఈ వెంకయ్య, తదితరులు పాల్గొన్నారు.

పశువుల షెడ్ల నిర్మాణ పనుల పరిశీలన

ఉంగుటూరు: పశువుల షెడ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఎంపీడీవో గంజిరాజ్‌మనో జు తెలిపారు. బుధవారం గోపినాథపట్నం, యర్రమిల్లిపాడు, గొల్లగూడెం, రామచంద్రపురం, నల్లమాడు, చేబ్రోలు తదితర గ్రామాల్లో ఆయన పర్యటించారు. పశువుల షెడ్ల నిర్మాణ పనులను ఆయన పరిశీలించి రైతులను చైతన్యపరిచారు. త్వరితగతిన నిర్మాణాలు పూర్తిచేస్తే గ్రాంటు అందజేస్తామని తెలిపారు. పశుసంవర్ధక శాఖ అధికార్లు, సహాయకులు, ఉపాధి ఫీల్డు సిబ్బంది, ఎంపీడీవో పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి


సీఐ లక్ష్మణరావు

ఏలూరు టౌన్: పట్టణంలోని ప్రజలు కచ్చితంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఏలూరు ట్రాఫిక్ సీఐ లక్ష్మణరావు కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏలూరు నగరంలో వాహనదారులు తప్ప కుండా హెల్మెంట్ ధరించాలని ట్రాఫిక్ సీఐ తెలిపారు. హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేస్తామని పేర్కొన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే వారి తల్లిదండ్రులపై చర్యలు తప్పవన్నారు. వాహనాలను సీజ్ చేస్తామని స్పష్టం చేశారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు


కామవరపుకోట: నిందితులను అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ సీఐ అశోక్, సిబ్బంది


కొయ్యలగూడెం: బెల్ట్‌షాపు నిర్వాహకుడిని అరెస్టు చేసిన దృశ్యం

పలువురిపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం/కుక్కునూరు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్ ఎక్సైజ్, డిస్ట్రిక్ట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్ ఆదేశాల మేరకు జంగారెడ్డిగూడెం ఎక్సైజ్ సీఐ శ్రీనుబాబు ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో దాడులు నిర్వహించామని ఎస్సైలు జి.వెంకటలక్ష్మి, ఎస్ఎస్ సుబ్రహ్మణ్యం తెలిపారు. జంగారెడ్డిగూడెం మండలం లక్ష్మీపురం గ్రామంలో 39 సుంకం చెల్లించని తెలంగాణ మద్యం సీసాలతో గుమ్ములూరి మునలయ్య అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామన్నారు. లక్కవరం గ్రామంలో 25 మద్యం సీసాలతో పులపాకల సత్యనారాయణ అనే వ్యక్తిపై, కుక్కునూరు మండలం కొండపల్లి గ్రామంలో తోట వెంకటేశ్వరరావు నుంచి 15 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఈఎస్ టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ ఆరీఫ్ తెలిపారు.

బెల్ట్ షాపుపై దాడి

కొయ్యలగూడెం: కన్నాపురంలో ఎక్సైజ్‌శాఖ బుధవారం నిర్వహించిన దాడిలో బెల్ట్ షాపు నిర్వాహకుడిని అదుపులోకి తీసుకున్నట్లు ఎక్సైజ్ ఎస్సై ఎల్.శ్రీనివాస్ తెలిపారు. నిందితుడి నుంచి 20 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

40 మద్యం సీసాల స్వాధీనం

కామవరపుకోట: మండలంలో అనధికారకంగా నిర్వహిస్తున్న బెల్టు షాపులపై దాడి చేసి 40 మద్యం సీసాలను పట్టుకుని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు చింతలపూడి ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐ పి.అశోక్ తెలిపారు. తడికలపూడి గ్రామంలో బుధవారం దాడులు నిర్వహించగా మట్టపర్తి వీరభద్ర అనే వ్యక్తి వద్ద నుంచి 20 క్వార్టర్ బాటిల్స్ (180 మిల్లీ లీటర్లు), కామవరపుకోటలో వీరంరెడ్డి సురేష్‌కుమార్ అనే వ్యక్తి నుంచి 20 క్వార్టర్ బాటిల్స్ స్వాదీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పాత కేసులో ముద్దాయి అయిన మట్టపర్తి వీరభద్రపై బైండ్ ఓవర్ కేసు నమోదు చేసి, తహసీల్దార్ ఎదుట హాజరు పరిచి, అతని ప్రవర్తన సరిగా లేనందున రూ.20 వేలు జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై అబ్దుల్ కలీల్, సిబ్బంది పాల్గొన్నారు.